

**2009 నవంబర్ 29 మలిదశ ఉద్యమాన్ని మలుపు తిప్పిన రోజు.** 'తెలంగాణ వచ్చుడో.. కేసీఆర్ సచ్చుడో' అనే నినాదం అందుకొని ఉద్యమ నేత కేసీఆర్ ఆమరణ నిరాహార దీక్షకు దిగి యావత్ తెలంగాణను ఉద్యమం వైపు నడిపించిన సందర్భం. నాలుగున్నర కోట్ల ప్రజల 'ప్రత్యేక' ఆకాంక్ష నెరవేరాలనే కేసీఆర్ సంకల్పం, అలుపెరుగని పోరాటం, పట్టుదల.. తెలంగాణ ప్రజల్లో ఉద్యమస్ఫూర్తి నింపి రాష్ట్రం సాకారమయ్యేలా చేసింది. ఈ సందర్భంగా ఆనాటి ఉద్యమ స్మృతులను గుర్తుచేసేందుకు బీఆర్ఎస్ నేడు(శుక్రవారం) ఉమ్మడి వరంగల్ వ్యాప్తంగా దీక్షా దివస్ నిర్వహించేందుకు సిద్ధమైంది. ఈ మేరకు అన్ని చోట్ల జిల్లాల ఇన్‌చార్జిల ఆధ్వర్యంలో వేలాది మందితో ర్యాలీలు, అమరవీరులకు నివాళులు, ఫొటో ఎగ్జిబిషన్, ఉద్యమకారులకు సన్మానాలు, తదితర కార్యక్రమాల కోసం అన్ని ఏర్పాట్లు చేయగా మాజీ మంత్రులు, ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొననున్నారు.

# ఉద్యమస్ఫూర్తితో..

# దీక్షా దివస్‌కు గుర్తుగా..



కార్పొరేషన్ ప్రధాన కార్యాలయ ఆవరణలోని దీక్షా దివస్ పైలాన్

- రాష్ట్రంలో ఏర్పాటు చేసిన ఏకైక పైలాన్
- ఉద్యమ స్మృతులకు నిలువెత్తు దర్పణం
- మూడేళ్ల క్రితం బల్దియా ఆవరణలో ఏర్పాటు

వరంగల్, నవంబర్ 28 : వలస పాలకుల చేతిలో బందీ అయిన తెలంగాణను విడిపించడానికి ఆనాటి ఉద్యమ నేత కేసీఆర్ 2009 నవంబర్ 29 చేపట్టిన దీక్ష సమస్త తెలంగాణను ఏకతాటిపైకి తీసుకొచ్చింది. అదే 'దీక్షా దివస్'గా తెలంగాణ ప్రజల గుండెల్లో నిలిచిపోయింది. కనీవినీ ఎరుగని రీతిలో సబ్బండ జాతులను ఏకం చేసి మలిదశ ఉద్యమం ఉగ్రరూపం దాల్చేలా చేసిన దీక్షకు గుర్తుగా వరంగల్ గ్రేటర్ కార్పొరేషన్ ఆవరణలో దీక్షా దివస్ పైలాన్‌ను ఏర్పాటు చేశారు. తెలంగాణ విద్యార్థి ఉద్యమ నాయకుడు, కార్పొరేటర్‌గా ఉన్న జోరిక రమేశ్ ఆనాడు కౌన్సిల్ సమావేశంలో దీక్షా దివస్ గుర్తుగా బల్దియా అవరణలో పైలాన్ ఏర్పాటు చేయాలని తీర్మానాన్ని ప్రవేశ పెట్టగా, అప్పటి మేయర్ గుండా ప్రకాశ్‌రావు ఆమోదం తెలిపి రూ. 10 లక్షల నిధులు కేటాయించారు. బల్దియా ఆవరణలో ఫిబ్రవరి 7, 2021న ఆనాడు మంత్రిగా ఉన్న ఎర్రబెల్లి దయాకర్‌రావు చేతుల మీదుగా దీక్షా దివస్ పైలాన్‌ను ఆవిష్కరించారు. అదేవిధంగా దీక్షా స్ఫూర్తి చిహ్నంగా బల్దియా ఆవరణలో ఏర్పాటు చేసిన 'బిగించిన పిడికిళ్లు' ఆనాటి ఉద్యమ జ్ఞాపకాలను గుర్తుకు తెస్తుంటాయి. పైలాన్‌పై ఒక వైపు ఉద్యమ నేత కేసీఆర్.. మరో వైపు తెలంగాణ రాష్ట్ర చిహ్నం కనిపిస్తుంది. తెలంగాణ ఉద్యమంతో అనుబంధం ఉన్న ప్రతి ఒక్కరూ దీక్షా దివస్ స్ఫూర్తి చిహ్నం వద్దకు రాగానే ఆనాటి జ్ఞాపకాలను నెమరు వేసుకుంటారు.



ఎగసిపడిన తెలంగాణ ఉద్యమానికి గుర్తుగా ఏర్పాటు చేసిన బిగించిన పిడికిళ్లు

## భవిష్యత్ తరాలకు ఉద్యమ స్ఫూర్తి



స్వరాష్ట్ర కలను సాకారం చేసిన కేసీఆర్ నిరాహార దీక్ష భవిష్యత్ తరాలకు స్ఫూర్తిదాయకంగా ఉండాలనే సంకల్పంతోనే బల్దియా ఆవరణలో పైలాన్ ఏర్పాటు చేయాలని ఆనాడు కౌన్సిల్‌లో తీర్మానం ప్రవేశ పెట్టాను. దీక్షా దివస్ స్ఫూర్తి చిహ్నం ఏర్పాటు కమిటీకి కన్వీనర్‌గా పనిచేశాను. ఉవ్వెత్తున ఎగిసిన తెలంగాణ ఉద్యమానికి గుర్తుగా బిగించిన పిడికిళ్లు, బానిస సంకెళ్ల నుంచి రాష్ట్రాన్ని విముక్తి చేసిన ఉద్యమ నేత కేసీఆర్ చిత్రం, సాధించిన తెలంగాణ రాష్ట్ర చిత్రంలో పైలాన్‌ను రూపొందించాం. రాష్ట్రంలో ఏకైక దీక్షా దివస్ పైలాన్ వరంగల్ కార్పొరేషన్ కార్యాలయ ఆవరణలో ఉండడం ఉద్యమ గడ్డ వరంగల్‌కు గర్వకారణం.

– జోరిక రమేశ్, తెలంగాణ ఉద్యమకారుడు, మాజీ కార్పొరేటర్

## దీక్షా దివస్‌కు సర్వం సిద్ధం

### మలుపు తిప్పిన కేసీఆర్ దీక్ష : దాస్యం

**నేడు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా కార్యక్రమాలు**

- ఎక్కడికక్కడ ర్యాలీలు, అమరువీరులకు ఘన నివాళులు
- వేలాదిగా తరలిరానున్న బీఆర్ఎస్ శ్రేణులు
- హాజరుకానున్న జిల్లా ఇన్‌చార్జిలు, మాజీ మంత్రులు, ముఖ్య నేతలు

హనుమకొండ, నవంబర్ 28 : ప్రత్యేక రాష్ట్రం కోసం 'తెలంగాణ వచ్చుడో.. కేసీఆర్ సచ్చుడో' అనే నినాదంతో తన ప్రాణాలను సైతం లెక్క చేయకుండా ఉద్యమ నేత కేసీఆర్ 2009 నవంబర్ 29న చేపట్టిన ఆమరణ నిరాహార దీక్ష ఉద్యమాన్నే మలుపు తిప్పిందని బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ తెలిపారు. నాటి ఉద్యమ స్మృతులను గుర్తుచేసుకుంటూ.. ఉద్యమస్ఫూర్తితో బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు శుక్రవారం హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో దీక్షా దివస్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 10.30 గంటలకు పార్టీ ఆఫీస్ నుంచి అదాలత్ జంక్షన్ వద్ద ఉన్న అమరవీరుల స్తూపం వరకు ర్యాలీ, 10.45 గంటలకు అమరులకు నివాళులర్పించడం, 11గంటలకు నక్కలగుట్టలోని కాళోజీ విగ్రహానికి, బాలసముద్రం ఏకశిల పార్కులో ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించనున్నట్లు తెలిపారు. 11.15 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు దీక్షా దివస్‌లో భాగంగా సాంస్కృతిక ప్రదర్శనలు, ఫొటో ఎగ్జిబిషన్, వక్తల ఉపన్యాసాలు ఉంటాయని వినయ్‌భాస్కర్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా దీక్షా దివస్ కార్యక్రమ జిల్లా ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ సురభి వాణీదేవి, మాజీ రాజ్యసభ సభ్యుడు కెప్టెన్ లక్ష్మీకాంతారావు, అతిథులుగా ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు తదితరులు హాజరవుతారని దాస్యం పేర్కొన్నారు.

## జనగామలో 10వేల మందితో..

- నెహ్రూపార్కు నుంచి చౌరస్తా వరకు భారీ ర్యాలీ
- హాజరుకానున్న జిల్లా ఇన్‌చార్జి భిక్షమయ్యగౌడ్, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ మంత్రి ఎర్రబెల్లి, మాజీ ఎమ్మెల్యే రాజయ్య

జనగామ, నవంబర్ 28(నమస్తే తెలంగాణ) : తెలంగాణ ఉద్యమాన్ని మలుపు తిప్పిన దీక్షా దివస్‌ను శుక్రవారం జనగామ జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించేందుకు బీఆర్ఎస్ సిద్ధమైంది. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనే ధ్యేయంగా 2009 నవంబర్ 29న బీఆర్ఎస్ పార్టీ అధినేత, తెలంగాణ రాష్ట్ర సాధకులు కేసీఆర్ చేపట్టిన దీక్ష మళ్లీ గుర్తుకొచ్చేలా ఈ నెల 29న దీక్షా దివస్‌ను బీఆర్ఎస్ నిర్వహిస్తున్నది. పార్టీ శ్రేణులతో పాటు తెలంగాణ ఉద్యమకారులను సన్నద్ధం చేసేందుకు ఇప్పటికే జిల్లాలోని పాలకుర్తి, స్టేషన్‌ఘన్‌పూర్, జనగామ నియోజకవర్గాల ముఖ్యనాయకులతో నిర్వహించిన సన్నాహక సమావేశాలకు జిల్లా ఇన్‌చార్జిగా నియమితులైన ఆలేరు మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్య గౌడ్ హాజరై దీక్షా దివస్ విజయవంతానికి దిశానిర్దేశం చేశారు. ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలులో వైఫల్యాలు, అసమర్థ పాలనను ఎండగట్టి ప్రజలను చైతన్యవంతులను చేసేలా దీక్షా దివస్ వేదికగా బీఆర్ఎస్ శంఖారావం పూరించనున్నది. జిల్లాలోని మూడు అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి హాజరుకానున్న వేలాది మంది గులాబీ సైనికులతో ఉదయం 10 గంటలకు పట్టణంలోని నెహ్రూపార్కు నుంచి పాదయాత్ర ర్యాలీగా అంబేద్కర్ చౌరస్తా వరకు చేరుకుంటారని దీక్షా దివస్‌కు అన్ని ఏర్పాట్లు చేసినట్లు జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి తెలిపారు. దీక్షా దివస్‌లో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, స్టేషన్ ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, ముఖ్య కార్యకర్తలు హాజరవుతారని పల్లా తెలిపారు.

## తెలంగాణ సాధకుడు కేసీఆర్

- ఉద్యమ స్మృతులను గుర్తుచేసుకోవాలి
- ఆయన తెచ్చిన పథకాలు దేశానికే ఆదర్శం
- దీక్షా దివస్ ఇన్‌చార్జి బాలకొండ కోటేశ్వరరావు

మహబూబాబాద్ రూరల్, నవంబర్ 28 : తెలంగాణ మలిదశ ఉద్యమ చరిత్ర స్మృతులను ప్రతి ఒక్కరూ గుర్తుచేసుకోవాలని మాజీ ఎమ్మెల్యే, దీక్షా దీవస్ మానుకోట జిల్లా ఇన్‌చార్జి బాలకొండ కోటేశ్వరరావు అన్నారు. గురువారం మహబూబాబాద్ పట్టణంలోని మాజీ ఎంపీ మాలోత్ కవిత క్యాంప్ ఆఫీస్‌లో దీక్షా దివస్ సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. 2009 నవంబర్ 29న తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం కేసీఆర్ తలపెట్టిన దీక్షతోనే రాష్ట్రం అంతటా ఉద్యమ స్ఫూర్తి నెలకొన్నదన్నారు. ఆనాడు సమైక్య పాలకులపై కేసీఆర్ కఠోర దీక్ష, పట్టుదలతో ఉద్యమం నడిపించారని పేర్కొన్నారు. ఈ దీక్షతో అప్పటి ఆర్థిక మంత్రి చిదంబరం డిసెంబర్ 9న ప్రత్యేక తెలంగాణను ప్రకటించారని, మళ్లీ ఆంధ్రా పాలకులు అడ్డుకోవడంతో ప్రకటనను వెనక్కి తీసుకున్నారని గుర్తుచేశారు. తెలంగాణ వచ్చుడో, కేసీఆర్ సచ్చుడో అనే నినాదంతో కేసీఆర్ సారథ్యంలో ప్రత్యేక రాష్ట్రం సాకారమైందని తెలిపారు. మళ్లీ ఆనాటి స్మృతులను, ఉద్యమం నాటి అంశాలను గుర్తుచేసుకోవాలన్నారు. ప్రత్యేక తెలంగాణ ఏర్పడిన తర్వాత కేసీఆర్ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశారని గుర్తుచేశారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు మాలోత్ కవిత మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ సమయంలో కేసీఆర్ అన్ని వర్గాల ప్రజలను కలుపుకొని శాంతియుత మార్గంలో రాష్ట్రాన్ని సాధించారని, దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో అనేక పథకాలు ప్రవేశపెట్టి రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేశారని చెప్పారు. కేసీఆర్ వల్లే పంటలు సమృద్ధిగా పండి తెలంగాణ ధాన్యాగారంగా మారిందని పేర్కొన్నారు. ఆనాటి ఉద్యమ చరిత్రను ప్రతి ఒక్కరు తెలుసుకునేందుకు దీక్ష దివస్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో ప్రతి ఒక్కరు భాగస్వాములై జయప్రదం చేయాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్ మాట్లాడుతూ పదేళ్లలో కేసీఆర్ దేశంలో ఎక్కడా లేని దళితబంధు, కల్యాణలక్ష్మి, రైతుబంధు, రైతుబీమా, ఉచిత విద్యుత్ వంటి అనేక పథకాలు అమలు చేశారని పేర్కొన్నారు. అనంతరం పట్టణంలోని అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించే ప్రాంతాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న, పర్కాల శ్రీనివాస్‌రెడ్డి, భరత్‌కుమార్‌రెడ్డి, నాయిని రంజిత్‌కుమార్, బీఆర్ఎస్ నాయకులు బానోత్ రవికుమార్, మంగళంపల్లి కన్న, జేరిపోతుల వెంకన్న, తేళ్ల శ్రీను, షేక్ ఖాదర్ బాబాతో పాటు వివిధ మండలాల పార్టీ అధ్యక్షులు, మాజీ ఎంపీటీసీలు, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.



మహబూబాబాద్ సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జి కోటేశ్వరరావు, చిత్రంలో మాజీ ఎంపీ మాలోత్ కవిత, మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్



నాయకులు, కార్యకర్తలకు సూచనలు చేస్తున్న భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

## కేసీఆర్‌ది చెరగని ముద్ర

**భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణ రెడ్డి**

కృష్ణకాలనీ, నవంబర్ 29 : జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో శుక్రవారం రెండు వేల మందితో దీక్షా దివస్‌ను నిర్వహించనున్నట్లు మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి తెలిపారు. నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున బీఆర్ఎస్ శ్రేణులు తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. దీక్షా దివస్‌పై గురువారం జిల్లా పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ ప్రజా ప్రతినిధులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా గండ్ర మాట్లాడుతూ ప్రతి మండలం నుంచి 200 నుంచి 300, భూపాలపల్లి అర్బన్, రూరల్ నుంచి 1,000 నుంచి 1,500 మందిని, మొత్తంగా 2,000 నుంచి 2,500 మందిని తరలించాలన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఇన్‌చార్జి, మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు ఇంటింటికి తెలిసేలా సభను నిర్వహిస్తామన్నారు. నవంబర్ 29, 2009న మహానాయకుడు కేసీఆర్ నిరాహార దీక్ష చేపట్టి మలిదశ తెలంగాణ ఉద్యమ చరిత్రపై చెరగని ముద్ర వేశారని, ఆయనను స్ఫూర్తిగా తీసుకొని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు దీక్షా దివస్‌ను ఘనంగా నిర్వహిస్తామన్నారు. ఉదయం 9.30 గంటలకు ఆర్టీసీ బస్టాండ్ వద్ద గల తెలంగాణ తల్లి విగ్రహానికి, అక్కడి నుంచి అంబేద్కర్ సెంటర్‌లోని అమరవీరుల స్తూపానికి, అనంతరం జయశంకర్ సెంటర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ విగ్రమాణికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తామన్నారు. అక్కడి నుంచి బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయానికి ర్యాలీగా వచ్చి కార్యక్రమాన్ని ప్రారంభిస్తామన్నారు. ఈ సందర్భంగా కేసీఆర్ నిరాహార దీక్ష, మలిదశ ఉద్యమ చరిత్రను వీడియో రూపంలో చూపించడంతో పాటు కేంద్ర, రాష్ట్ర వైఫల్యాలను ప్రజలకు వివరిస్తామని గండ్ర తెలిపారు. సమావేశంలో బీఆర్ఎస్ అర్బన్ అధ్యక్షుడు కటకం జనార్దన్, భూపాలపల్లి మున్సిపల్ చైర్ పర్సన్ సెగ్గం వెంకటరాణీసిద్ధు, భూపాలపల్లి రూరల్ అధ్యక్షుడు పిన్‌రెడ్డి రాజిరెడ్డి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ నూనె రాజు పటేల్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ కొత్త హరిబాబు, అర్బన్ యూత్ అధ్యక్షుడు బుర్ర రాజు, టీజేఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మాడా హరీశ్‌రెడ్డి, కౌన్సిలర్లు ముంజంపల్లి మురళీధర్, దార పూలమ్మ, కో ఆప్షన్ మెంబర్ దొంగల ఐలయ్య యాదవ్, నాయకులు గురజాల శ్రీనివాస్, బీబీ చారి, జోరు ఈశ్వర్, శ్రీకాంత్ పటేల్, కృష్ణమూర్తి, భాస్కర్, మహిళా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఇద్దరు అధికారులపై వేటు

- సెర్ప్ అదనపు డీఆర్డీవో శ్రీనివాస్, డీపీఎం సమ్మక్క సస్పెన్షన్
- మహిళా సమాఖ్యలో నిధుల గోల్‌మాల్‌పై జనగామ కలెక్టర్ చర్యలు

నమస్తే ఎఫెక్ట్

జనగామ చౌరస్తా, నవంబర్ 28 : జనగామలోని చాకలి ఐలమ్మ జిల్లా మహిళా సమాఖ్యలో జరిగిన నిధుల గోల్‌మాల్ బాధ్యులపై కలెక్టర్ చర్యలు తీసుకున్నారు. సెర్ప్ అదనపు డీఆర్డీవో బోనగిరి శ్రీనివాస్‌తో పాటు డీపీఎం (ఐబీ అండ్ బీఎల్) దాసరి సమ్మక్కను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా ఉత్తర్వులు జారీ చేశారు. జనగామ మండలంలోని వెంకిర్యాల గ్రామంలో నాలుగెకరాల భూమిని మార్కెట్ రేటు కన్నా అధికంగా రూ. 2.35 కోట్లతో కొనుగోలు చేసిన విషయంలో వారిని బాధ్యులుగా గుర్తించి వేటు వేశారు. ఈ మేరకు గురువారం కలెక్టర్ ఒక ప్రకటన విడుదల చేశారు. భూమి కొనుగోలులో అక్రమాలు చోటు చేసుకున్నాయని 'నమస్తే తెలంగాణ' పలు కథనాలను ప్రచురించింది. 'మహిళా సమాఖ్యలో నిధుల గోల్‌మాల్' (అక్టోబర్ 25), 'నిధుల గోల్‌మాల్ నిజమే'(అక్టోబర్ 29), 'సమాఖ్యలో రూ.30 లక్షల రికవరీ' (నవంబర్ 8) శీర్షికలతో వరుసగా ప్రచురితమైన కథనాలకు స్పందించిన కలెక్టర్ సమగ్ర విచారణ జరిపించి బాధ్యులైన శ్రీనివాస్, సమ్మక్కను సస్పెండ్ చేశారు. కాగా, సస్పెండైన అధికారులతో పాటు ఈ బాగోతంలో పాత్ర ఉన్న మహిళా సమాఖ్య ప్రతినిధులు, భూమిని విక్రయించిన వ్యక్తిపై క్రిమినల్ కేసు నమోదు చేసేందుకు వెస్ట్ జోన్ డీసీపీతో కలెక్టర్ చర్చించినట్లు సమాచారం. 1,26,922 మంది సభ్యులున్న సమాఖ్యలో రూ.2.35 కోట్లు పక్కదారి పట్టిన విషయాన్ని ఆధారాలతో బయటపెట్టిన 'నమస్తే తెలంగాణ'కు మహిళా సంఘాల సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

## ఓపెన్ స్కూల్‌కు మరో అవకాశం

**టెన్త్, ఇంటర్ అడ్మిషన్లకు 11 వరకు గడువు**

హనుమకొండ చౌరస్తా, నవంబర్ 28: తెలంగాణ సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో 2024–25 విద్యాసంవత్సరానికిగాను అడ్మిషన్లకు డిసెంబర్ 11 వరకు చివరి అవకాశం కల్పిస్తున్నట్లు హనుమకొండ జిల్లా విద్యాశాఖాధికారి డీ వాసంతి, ఉమ్మడి జిల్లా ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ అనగోని సదానందం ఒక ప్రకటనలో తెలిపారు. ఓపెన్ టెన్త్, ఇంటర్మీడియెట్ కోర్సుల్లో చేరేందుకు ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన ఆసక్తి గల అభ్యర్థులు సమీపంలోని ఉన్నత పాఠశాలలు, జూనియర్ కాలేజీల్లో సంప్రదించాలన్నారు. అర్హులు ఓపెన్ స్కూల్ అధ్యయన కేంద్రాల్లో సంప్రదించి, ధ్రువపత్రాలు సమర్పించి, అడ్మిషన్ ఫారం పొందాలన్నారు.

దరఖాస్తులను ఆన్‌లైన్ ద్వారా మాత్రమే నమోదు చేయాల్సి ఉంటుందన్నారు. విద్యార్థులు www.telanganaopenshool వెబ్‌సైట్ ద్వారా అడ్మిషన్ ఫీజును చెల్లించి రసీదు పొంది అధ్యయన కేంద్రాల్లో అడ్మిషన్ ఫారం ప్రింటౌట్‌ను డిసెంబర్ 11న సమర్పించాలన్నారు. పూర్తి వివరాలకు ఉమ్మడి జిల్లా ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ సదానందంను 93460 20003, 93963 37572 నంబర్లలో సంప్రదించాలని కోరారు.





## మల్లంపల్లి.. కొత్త మండలం

**గెజిట్ విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వం**

- రెండు రెవెన్యూ గ్రామాలతో ఏర్పాటు
- 10 గ్రామాలు, ఐదు ఎంపీటీసీలకు పరిమితం

ములుగు, నవంబర్ 28 (నమస్తే తెలంగాణ) : మండలం కావాలనే మల్లంపల్లి గ్రామ ప్రజల కల నెరవేరింది. సుదీర్ఘకాలంగా ఎదురుచూస్తున్న వేళ ములుగు మండలంలోని మల్లంపల్లి గ్రామాన్ని ప్రత్యేక మండలంగా ఏర్పాటు చేస్తూ రాష్ట్ర రెవెన్యూ శాఖ ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్ ఫైనల్ గెజిట్ నోటిఫికేషన్‌ను గురువారం విడుదల చేశారు. మల్లంపల్లిని మండలం చేసేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే ప్రతిపాదనలు సిద్ధం చేయగా.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన సంవత్సర కాలం తర్వాత మల్లంపల్లిని మండలంగా ఏర్పాటు చేస్తూ నోటిఫికేషన్ విడుదల చేసింది. మల్లంపల్లి, రామచంద్రాపురం రెవెన్యూ గ్రామాల్లోని 10 గ్రామాలను కలుపుకొని మండలం ఏర్పాటు చేశారు. కొత్తగా ఏర్పాటయ్యే మల్లంపల్లి మండలంలో మహ్మద్‌గౌస్‌పల్లి, దేవనగర్, శ్రీనగర్, భూపాల్‌నగర్, శివతండా, మల్లంపల్లి గ్రామాలతో పాటు రామచంద్రాపురం, ముద్దునూరుతండా, గుర్తూరుతండా, కొడిశలకుంట గ్రామాలు విలీనం కానున్నాయి. ప్రస్తుతానికి మల్లంపల్లి మండల పరిధిలో మల్లంపల్లి-1, మల్లంపల్లి-2, భూపాల్‌నగర్, రామచంద్రాపురం, కొడిశలకుంట పరిధిలోని 5 ఎంపీటీసీలు, 10 సర్పంచ్‌లతో కొనసాగనున్నది.

## సర్కారుపై భగ్గుమన్న విద్యార్థి

- గురుకులాల్లో మరణాలపై విద్యార్థి సంఘాల నిరసన
- ఉమ్మడి జిల్లాలో సీఎం రేవంత్‌రెడ్డి, ప్రభుత్వ దిష్టిబొమ్మల దహనం
- విద్యార్థులు చనిపోతుంటే విజయోత్సవాలా? అంటూ ఆగ్రహం
- నాణ్యమైన భోజనం అందించాలని డిమాండ్





రఘునాథపల్లి : రాస్తారోకో చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్ : ఫుడ్ పాయిజన్‌తో గురుకుల విద్యార్థులు మృతి చెందడంపై విద్యార్థి సంఘాలు భగ్గుమన్నాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పలుచోట్ల గురువారం పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టాయి. జనగామలోని ఆర్టీసీ చౌరస్తా, భూపాలపల్లిలోని అంబేద్కర్ సెంటర్‌తోపాటు చిట్యాల, మహదేవపూర్ మండల కేంద్రాల్లో ఏబీవీపీ నాయకులు సీఎం రేవంత్ రెడ్డి, ప్రభుత్వ దిష్టిబొమ్మలు దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి 51 మంది విద్యార్థులు ఫుడ్ పాయిజన్, ఇతర కారణాలతో మరణిస్తే ప్రభుత్వం పట్టించుకోవడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారుల నిర్లక్ష్యంతోనే గురుకుల విద్యార్థులు కల్తీ ఆహారం తిని అస్వస్థతకు గురవుతున్నారని ఆరోపించారు. ఓ వైపు విద్యార్థులు మరణిస్తుంటే మరోవైపు కాంగ్రెస్ విజయోత్సవాలు జరుపుకోవడం సిగ్గుచేటన్నారు. తమది ప్రజా ప్రభుత్వమని చెప్పుకుంటున్న అధికార పార్టీ నాయకులు గురుకుల విద్యా వ్యవస్థను పూర్తిగా నాశనం చేస్తున్నారన్నారు. విద్యా శాఖను తనవద్దే ఉంచుకున్న ముఖ్యమంత్రి విద్యార్థులు చనిపోతుంటే సోయిలేకుండా వ్యవహరిస్తున్నాడన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అన్ని ప్రభుత్వ వసతి గృహాలు, గురుకులాల్లో నాణ్యమైన భోజనం అందించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఏబీవీపీ ఆధ్వర్యంలో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అలాగే ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో హనుమకొడలోని అంబేద్కర్ జంక్షన్, జనగామలోని నెహ్రూ పార్కు వద్ద ఆందోళన చేపట్టారు. రఘునాథపల్లి మండల కేంద్రంలో రాస్తారోకో నిర్వహించగా, మహబూబాబాద్ జిల్లా కురవి బస్టాండ్ సెంటర్‌లో ధర్నా చేశారు. విద్యా వ్యవస్థ అస్తవ్యస్తంగా మారడంతోనే విద్యార్థుల ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయన్నారు. రాష్ట్రంలోని అన్ని పాఠశాలలు, గురుకులాలు, వసతి గృహాల్లో నాణ్యమైన భోజనమందించాలని, మెస్ చార్జీలు పెంచాలని, వెంటనే విద్యాశాఖ మంత్రిని నియమించాలని, చనిపోయిన విద్యార్థులకు రూ. 50 లక్షల పరిహారం అందించాలని డిమాండ్ చేశారు.



మహదేవపూర్ : సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఏబీవీపీ నాయకులు